క్లుప్తంగా

సంగమేశ్వరంలో అలరించిన భజన


భజన చేస్తున్న బృందం

కొత్తపల్లి: కృష్ణానదీ తీరంలో, సప్తనదీ సంగమ ప్రాంతంలో వెలసిన పవిత్ర పుణ్యక్షేత్రం ప్రాచీన సంగమేశ్వరాలయంలో గురువారం వరూధిని ఏకాదశి సందర్భంగా భజన కార్యక్రమం నిర్వహించారు. ఆత్మకూరు భజన బృందం సభ్యులు రాజేశ్, కిరణ్ తదితరులు ఆలయ ప్రాంగణంలో భజన చేపట్టారు. వినాయకుడి శ్లోకంతో ప్రారంభించి శివపార్వతుల భక్తిగీతాలు ఆలపించారు.

మహానందీశ్వరుడికి జడ్జి పూజలు


న్యాయమూర్తికి ప్రసాదాలు అందిస్తున్న సూపరింటెండెంట్

మహానంది: జిల్లా ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి తంగమని గురువారం కామేశ్వరి, మహానందీశ్వరస్వామిని దర్శించుకున్నారు. న్యాయమూర్తికి ఆలయ సూపరింటెండెంట్ అంబటి శశిధర్‌రెడ్డి స్వాగతం పలికి పూజలనంతరం స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేయించారు.

అబ్బీపురం వాసికి డాక్టరేట్


డాక్టరేట్ అందుకుంటున్న కంచి సుభాన్

మహానంది: అబ్బీపురం గ్రామానికి చెందిన కంచి సుభాన్‌కు ఎస్కే యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. గణితశాస్త్రం విభాగాధిపతి డాక్టర్ శోభలత పర్యవేక్షణలో ఫ్లూయిడ్ డైనమిక్స్‌లో 'వివిధ ప్రవాహ గతిశీలతలతో మాగ్నెటో హైడ్రో డైనమిక్ నాన్-న్యూటోనియన్ ద్రవ ప్రవాహం ఉష్ణ ద్రవ్యరాశి బదిలీ లక్షణాలు' అంశంపై చేసిన పరిశోధనలకు గానూ తనకు డాక్టరేట్ వచ్చిందని సుభాన్ తెలిపారు.

సదరం క్యాంపు ప్రారంభం


దివ్యాంగుడికి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో గురువారం సదరం క్యాంపును ప్రారంభించారు. మూడురోజుల పాటు క్యాంపు ఉంటుందని వైద్యులు శివకృష్ణ, తహసీల్దార్ కేవీ శ్రీనివాసులు, డీఆర్‌డీఏ ఏపీఎం మధుబాబు, సీసీ శేషు తెలిపారు. లింగాలగట్టు, శ్రీశైలం, సున్నిపెంట గ్రామాల పరిధిలోని 157 మంది దివ్యాంగులు సదరం క్యాంపులో తమ అంగవైకల్య శాతాన్ని నిర్ధారించుకోవాలని సూచించారు.

రసాయనాల వినియోగంతో నేల నిర్జీవం


భూమిని పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డి

పాములపాడు: పంట పొలాల్లో పంటల సాగులో మితిమీరిన రసాయనాలు వినియోగించడం వల్ల భూమి నిర్జీవంగా మారుతుందని మండల వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డి అన్నారు. గురువారం శాంతినిలయం గ్రామంలో రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేలకు పునరుజ్జీవం కల్పించాలన్నారు. అందుకు ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటల సాగును ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. భూసారం పెంచేలా ఖరీఫ్ సీజన్‌లో నవధాన్యాల విత్తనాలు వేయాలని రైతులకు సూచించారు.

దత్తాత్రేయ స్వామికి విశేష పూజలు


పూజలందుకున్న స్వామివారు

శ్రీశైలం టెంపుల్: లోక కళ్యాణం కోసం దేవస్థానం గురువారం ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద నెలకొని ఉన్న దత్తాత్రేయ స్వామివారికి విశేష పూజలను నిర్వహించింది. పూజా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహా గణపతి పూజను జరిపించారు. తర్వాత పంచామృతాభిషేకం, విశేష పూజలు నిర్వహించారు.

'ఉపాధి'లో బోగస్ హాజరుతో దోపిడీ!

వలసలను నివారించి సొంత ఊరిలోనే పనులు కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకం అక్రమార్కులకు వరంగా మారింది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడడంతో క్షేత్ర స్థాయిలోని టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్స్, మేట్స్ బోగస్ హాజరుకు పాల్పడుతూ ఒక్క ఫొటోనే వేర్వేరు పని ప్రదేశాల్లో అప్‌లోడ్ చేసి అధికారులను బురిడీ కొట్టిస్తున్నారు.

- ఆరు రోజులు పనిచేస్తే నాలుగు రోజులకే హాజరు
- వేతనంలోనూ కోత..
- టెక్నికల్ సిబ్బంది ఇష్టారాజ్యం


చెట్టు నీడలో సేదతీరుతున్న ఉపాధి కూలీలు


నెహ్రూనగర్‌లో పూడిక తీత పనులు చేస్తున్న కూలీలు

పగిడ్యాల: మండలంలోని పది గ్రామ సచివాలయాల పరిధిలో ఉపాధి పనులు ఇటీవల ఊపందుకున్నాయి. రోజుకు 2,500 మందికి పనులు కల్పించాలని టార్గెట్ ఉండగా దాదాపు 2,130 మంది కూలీలు ఉపాధి పనులకు హాజరవుతున్నారు. ఉదయం 7 గంటలకే పని ప్రదేశానికి వెళ్లిన కూలీలు అధికారులు విజిట్‌కు రాక ముందే తిరిగి 10 గంటలకు ఇంటి దారి పడుతున్నారు. పని ప్రదేశంలో రెండు ఫొటోలు అప్‌లోడ్ చేయాల్సి ఉండగా ఒక్క ఫొటోతోనే సరిపెడుతున్నా అధికారులు నిమ్మకుంటున్నారు. మేట్లతో మిలాఖత్ అయిన టెక్నికల్ అసిస్టెంట్లు బోగస్ హాజరును ప్రోత్సహిస్తుండడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గ్రామాల్లో అధికార కూటమి నాయకుల కుటుంబీకుల పేర్లపై కూడా హాజరు వేసి నిధుల దోపిడీకి పాల్పడుతున్నారనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. 12 వారాలుగా కూలీలకు వేతనాలు అకౌంట్స్‌లో జమ కాకపోవడంతో వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులు వర్ణనాతీతం. ఆరు రోజులు పనిచేస్తే టెక్నికల్ సిబ్బంది 4 రోజులకే బిల్లులు చేసి మమ అనిపిస్తున్నారని కూలీలు చెబుతున్నారు. బోగస్ హాజరుకు పాల్పడుతున్న అక్రమార్కుల భరతం పట్టేందుకు జిల్లా ఉన్నతాధికారులు తనిఖీలను ముమ్మరం చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సరాసరి రూ. 274 వేతనం వస్తోంది

మండల వ్యాప్తంగా 2,130 మంది కూలీలకు ఉపాధి కల్పిస్తున్నాం. సగటున రూ. 274లు వేతనం పడుతోంది. రూ.300లు అందుకున్న కూలీలు కూడా ఉన్నారు. పని ప్రదేశానికి వెళ్లిన గంటలోగా మొదటి ఫొటో అప్‌లోడ్ చేయాలి. ఇంటికి వచ్చే సమయంలో మరో ఫొటోను అప్‌లోడ్ చేయాల్సి ఉంది. ఇలా రెండు ఫొటోలు ఎవ్వరు అప్‌లోడ్ చేయడం లేదు. ఒక్క ఫొటోనే అప్‌లోడ్ చేసి వెళ్తున్నారు. బోగస్ హాజరుకు ఎవ్వరు పాల్పడినా ఆర్ఆర్ యాక్ట్ కింద రికవరీ చేయిస్తాం. 12 వారాల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. నిధులు విడుదల అయ్యాయి. ఇప్పుడు రెండు వారాల బిల్లులు కూలీల అకౌంట్లలో జమ అయ్యాయి.

– మద్దిలేటి, ఏపీఓ, పగిడ్యాల

కూలీలు వేయడం లేదు



ఉపాధి హామీ పథకం కింద వరద మళ్లింపు కాలువల్లో పూడిక తీసేందుకు వెళ్తున్నాం. రెండు వారాల పని డబ్బులు చాలా తక్కువగా వేశారు. రోజుకు రూ.110లు ప్రకారం 4 రోజులకే డబ్బులు జమ చేశారు. ఆరు రోజులు పనిచేసినా టెక్నికల్ అసిస్టెంట్స్ 4 రోజుకే బిల్లులు చేయడం బాధేస్తోంది.

– జయమ్మ, నెహ్రూనగర్

రూ.250 కూడా రావడం లేదు



మండుటెండల్లో పని చేస్తే కనీసం రూ.250ల వేతనం కూడా రావడం లేదు. రూ. 110లు వేశారు. వేరే గ్రూపు సభ్యులకు రూ.300లు కూడా వేస్తున్నారంట. మా గ్రూప్‌కు మాత్రం తక్కువ ఇస్తున్నారు. ఎక్కువ కూలీ వేయడానికి ఫీల్డ్ అసిస్టెంట్లకు ఏమైనా ఇవ్వాలేమో మాకు తెలియదు. పై అధికారులు మాత్రం రూ.250ల నుంచి రూ.300 వరకు బిల్లులు వస్తాయని చెబుతున్నా మాకు ఏనాడు రాలేదు.

– సూరమ్మ, నెహ్రూనగర్

గోసంరక్షణ నిధికి రూ.లక్ష విరాళం


దాతను సత్కరిస్తున్న అధికారులు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న గో సంరక్షణ నిధి పథకానికి గురువారం విజయవాడకు చెందిన జి.ఓబుల్ నాయుడు రూ.1,50,000 విరాళాన్ని పర్యవేక్షకులు మల్లికార్జునకు అందించారు. దాతలకు దేవస్థానం తరపున స్వామి వారి శేష వస్త్రాన్ని, లడ్డూ ప్రసాదాలను, జ్ఞాపికను అందజేసి సత్కరించారు.

రాయితీపై దాణా సరఫరా

జూపాడుబంగ్లా: పశుపోషకులకు 50 శాతం రాయితీపై సమీకృత దాణాను సరఫరా చేస్తున్నట్లు పశు సంవర్ధకశాఖ ఏడీ రామాంజినాయక్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ 50 కేజీల దాణా సంచి పూర్తి ధర రూ.1,110 కాగా 50 శాతం రాయితీ రూ.555లకు రైతులకు అందజేస్తున్నట్లు తెలిపారు. కావాల్సిన రైతులు భారత్ పశుధన్ యాప్‌లోపేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

సచివాలయం తనిఖీ

బండి ఆత్మకూరు: మండల పరిధిలోని కడమల కాలువ సచివాలయాన్ని గురువారం జిల్లా సర్వే, ల్యాండ్ రికార్డ్స్ ఏడీ జయరాజ్ తనిఖీ చేశారు. సర్వే, భూ పరిమాణాల ప్రక్రియలపై సమీక్షించి, అధికారులను అడిగి వివిధ అంశాలపై వివరణ తీసుకున్నారు. అనంతరం భూ సంబంధిత సమస్యలపై వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి అధికారులకు సూచనలిచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ పద్మావతి, మండల సర్వేయర్ పర్వీన్ పాల్గొన్నారు.

పిరికి పందల చర్య

- నినదించిన ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు
- పహల్గామ్ మృతులకు ఘన నివాళులు


పటేల్ సెంటర్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు, పట్టణ ప్రజలు


గౌడ్ సెంటర్‌లో మానవహారంగా నిలబడిన ప్రజా సంఘాల నాయకులు


మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు: నిరాయుధులైన పర్యాటకులను ఉగ్రవాదులు నిలబెట్టి కాల్చి చంపడం పిరికి పందల చర్యగా ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు అభివర్ణించారు. పహల్గామ్ దాడిని నిరసిస్తూ గురువారం రాత్రి వైఎస్సార్‌సీపీ, విశ్వహిందూ పరిషత్, జనసేన, టీడీపీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు విజయ్‌చౌదరి, నాగరాజు, గోకారి, మురళి, ఆర్యవైశ్య సంఘం వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి అమ్మవారి ఆలయ అధ్యక్షులు నరహరి సత్యనారాయణశర్మ, విశ్వహిందూ పరిషత్ నాయకులు సుదర్శన్, సత్యనారాయణశర్మ, టీడీపీ నాయకులు సతీష్, జనసేన నాయకులు హరీఫ్, అరుణ్, మహేష్, అబివుల్లా, ఖాజాహుసేన్‌తో పాటు వివిధ ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడి హేయమైన చర్య అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అంతకుముందు పాత బస్టాండు అంబేడ్కర్ విగ్రహం నుంచి గౌడ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. గౌడ్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి ఉగ్రవాదుల దాడులను ఖండిస్తూ నినాదాలు చేశారు.

ఉగ్రదాడికి పాల్పడి వారిని కఠినంగా శిక్షించాలి

నందికొట్కూరు: ఉగ్రదాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని శ్రీరామ థియేటర్ రామిరెడ్డి, సీపీఐ నాయకులు రఘురామమూర్తి కోరారు. ఉగ్రదాడిలో చనిపోయిన వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ గురువారం పట్టణంలో కేజీ రోడ్డుపై సీపీఐ నాయకులు, పట్టణ ప్రజలు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులను చంపడం తగదన్నారు. మానవత్వం ఉన్న వారు ఎవరైనా ఇలాంటి దాడులు చేయరన్నారు. హిందూముస్లింల మధ్య చిచ్చు రేపడానికి ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రాముడు, నాగేంద్ర, సూరి, రహంతుల్లా, షఫి, రామకృష్ణ, జగదీష్, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

దర్యాప్తు వేగవంతం చేయాలి

ఆత్మకూరు: కశ్మీర్‌లో కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతున్న పర్యాటకులపై విచక్షణారహితంగా కాల్పులు జరిపి 26 మందిని పొట్టన పెట్టుకున్న తీవ్రవాదుల దుశ్చర్యను తమ పార్టీ ఖండిస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నరసింహానాయక్, పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్‌లు అన్నారు. పహల్గామ్ దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపాన్ని తెలియజేస్తూ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు సానుభూతి తెలియజేశారు. ఈ దాడిలో అనేకమంది తీవ్రంగా గాయపడ్డారని, వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. సమగ్ర దర్యాప్తు చేపట్టి దాడికి పాల్పడిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రామ్‌నాయక్, వీరన్న, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, మారెన్న, తుమ్మలూరు శివకుమార్, మల్లయ్య, రవి, రాజేష్, మాబాషా, మూర్తుజా పాల్గొన్నారు.

మహానందిలో 44 డిగ్రీల ఉష్ణోగ్రత

మహానంది: భానుడి ఉగ్రరూపానికి ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉదయం నుంచే ఉక్కపోత, కాస్త పొద్దెక్కగానే ఎండ తీవ్రతకు బయటికి రావాలంటేనే జంకుతున్నారు. గురువారం 44 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

మహానందిలో భక్తుల సందడి


కోనేరులో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు

మహానంది: పది పరీక్షలు ముగియడంతో పాటు సెలవులు కలిసి రావడంతో గురువారం మహానంది ఆలయం భక్తులతో కళకళలాడింది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చి కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు.

నేడు ప్రదోషకాల అభిషేకం

మహానందిలో నందీశ్వరస్వామికి శుక్రవారం ప్రదోష కాలంలో అభిషేకం పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ బహుళ త్రయోదశి పురస్కరించుకుని సాయంత్రం 4 గంటల నుంచి పూజలు ఉంటాయన్నారు. ఆర్జిత సేవా టికెట్లతో పూజల్లో పాల్గొనదలచిన భక్తులు మధ్యాహ్నం 3.30 గంటలకు ఆలయంలో ఉండాలని కోరారు.

ఉచితంగా ఆయిల్‌పామ్ మొక్కలు


మాట్లాడుతున్న ఉద్యానశాఖ అధికారి హరిచందన

పాములపాడు: ఆయిల్‌పామ్ మొక్కలను రైతులకు వంద శాతం సబ్సిడీతో ఇవ్వనున్నట్లు ఉద్యానశాఖ అధికారి హరిచందన తెలిపారు. గురువారం వ్యవసాయ కార్యాలయం వద్ద పతంజలి ఫుడ్స్ లిమిటెడ్, ఉద్యానశాఖ ఆధ్వర్యంలో రైతులకు ఆయిల్ పామ్ పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎకరాకు 57 ఏళ్ల వయస్సు ఉన్న మొక్కలు ఇవ్వనున్నట్లు చెప్పారు. నాటిన 4 ఏళ్ల నుంచి దిగుబడి వస్తుందన్నారు. ఏడాదికి రూ.10,500 చొప్పున నాలుగేళ్ల పాటు నిర్వహణ ఖర్చులు ఇవ్వనున్నట్లు తెలిపారు. అంతర పంటలు కూడా సాగు చేసుకోవచ్చన్నారు. సమావేశంలో మండల వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డి, పతంజలి జిల్లా మేనేజర్ మహాదేవయ్య, డిప్యూటీ మేనేజర్ రమణారెడ్డి, ఎన్ఆర్ఈజీఎస్ పాల్గొన్నారు.

న్యాయశాఖ మంత్రి జోక్యం తగదు


మాట్లాడుతున్న సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

ఆత్మకూరు: బేవరేజెస్ హమాలీ కార్మికుల విషయంలో న్యాయశాఖ మంత్రి ఫరూక్ జోక్యం తగదని సీఐటీయూ పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, పట్టణ ఉపాధ్యక్షులు రణధీర్, నాయకులు మారెన్న, వ్యవసాయ కార్మిక జిల్లా సహాయ కార్యదర్శి నరసింహనాయక్ అన్నారు. మంత్రి జోక్యం చేసుకోవడంపై గురువారం వారు నిరసన తెలిపారు. ఆంధ్రప్రదేశ్ బేవరేజెస్ కార్పొరేషన్ నంద్యాల గోడౌన్‌లో హమాలీ కార్మికులకు పనిలో తీసుకునేందుకు నోటిఫికేషన్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో డీఆర్వో, అసిస్టెం లేబర్ కమిషనర్, డీఎంఅండ్‌హెచ్‌ఓ, గోడౌన్ జనర్ మేనేజర్‌లతో కలిసి ఒక కమిటీ ఏర్పాటు చేసుకుని ఖాళీగా ఉన్న 36 మంది హమాలీ కార్మికులను తీసుకునేందుకు నోటిఫికేషన్ ఇచ్చారన్నారు. ఇప్పటి వరకు 170 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. కాగా ఇంటర్వ్యూలు లేకుండా తమకు అనుకూలమైన వారిని తీసుకునేందుకు మంత్రి జోక్యం చేసుకోవడం తగదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రాజేష్, మల్లయ్య, రవి, శివ, విజయ్ పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

మహానంది: ఎస్సీ కార్పొరేషన్‌కు సంబంధించి 10 యూనిట్లు లక్ష్యం ఉందని, అర్హులైన ఎస్సీ లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీఓ మహబూబ్ దౌలా తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఎస్సీ యాక్షన్ ప్లాన్- 2025-26 ఏడాదికి సబ్సిడీతో ఇచ్చే రుణాలకు దరఖాస్తు చేసుకునేందుకు వచ్చే నెల 10 వరకు గడువు ఉందన్నారు.

క్రికెట్ విజేతలకు బహుమతులు అందజేత


బహుమతులు అందజేస్తున్న అతిథులు

పగిడ్యాల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని లక్ష్మాపురం సీఎస్ఐ సంఘస్తులు నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో విజేతలకు గురువారం ముచ్చుమర్రి ఇన్‌చార్జ్ ఎస్ఐ చంద్రశేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ ఉస్మాన్ బాషా నగదు బహుమతులు అందజేశారు.

పెద్దమ్మ తల్లికి ముడుపులు

మహానంది: అబ్బీపురం గ్రామంలో పెద్దమ్మ జాతరను నిర్వహించేందుకు గ్రామస్తులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 29, 30 తేదీల్లో పెద్దమ్మ దేవరను నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. అందులో భాగంగా గురువారం గ్రామస్తులు మేళతాళాలు, భాజాభజంత్రీలతో పెద్దమ్మ తల్లి ఆలయానికి అమ్మవారికి ముడుపులు కట్టారు.

రుణాలకు దరఖాస్తులు

బండిఆత్మకూరు: ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు పొందేందుకు అర్హత కలిగిన అభ్యర్థులు మే 10 లోపు ఓబీఎంఎంఎస్ వెబ్ సైట్‌లో గానీ, సచివాలయాల్లో గానీ దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ ఎం.దస్తగిరి గురువారం ప్రకటనలో తెలిపారు.

భర్త పింఛన్‌కు భార్య అర్హురాలు

జూపాడుబంగ్లా: ప్రభుత్వం మంజూరు చేసే పింఛన్‌దారుడైన భర్త మరణిస్తే అతని భార్యకు పింఛన్ మంజూరు చేసే అవకాశం ఉందని ఎంపీడీఓ గోపీకృష్ణ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ 2023 జనవరి 01 నుంచి 31 అక్టోబర్ 2024 మధ్య కాలంలో పింఛన్‌దారుడైన వ్యక్తి మరణిస్తే అతని భార్యకు స్పౌస్ కింద పింఛన్ మంజూరు కోసం సచివాలయాల్లో వెల్ఫేర్ అసిస్టెంట్ వద్ద దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం


ఎంపీడీఓ కార్యాలయ సిబ్బందిని సన్మానించిన దృశ్యం


ప్రజాప్రతినిధులను సత్కరించిన అధికారులు


గాంధీ, అంబేడ్కర్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అధికారులు

కొత్తపల్లి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాణ డాక్టర్ బీఆర్ అబేడ్కర్, జాతిపిత మహాత్మాగాంధీ చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మేరి మాట్లాడుతూ పంచాయతీ రాజ్ వ్యవస్థ ద్వారా గ్రామాలను స్వచ్ఛంగా ఉంచుతున్నామన్నారు. కార్యక్రమంలో ఏపీఓ విమలమ్మ, హౌసింగ్ ఏఈ పాండురంగ నాయక్, ఐటీడీఏ ఏపీఓ రాజునాయక్, ఎంపీడీఓ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులకు సన్మానం

జూపాడుబంగ్లా: పంచాయతీరాజ్‌శాఖ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజాప్రతినిధులను అధికారులు సన్మానించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ గోపికృష్ణ మాట్లాడుతూ పంచాయతీరాజ్‌శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజల సమస్యల పరిష్కారంలో ముందుంటారన్నారు. అనంతరం ఎంపీపీ సువర్ణమ్మ, ఎంపీటీసీ మోతెవెంకటమ్మ, మండ్లెం సర్పంచ్ కృపమ్మలకు శాలువ కప్పి, పూలమాలతో ఎంపీడీఓ, కార్యాలయ సిబ్బంది సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మొట్టె బాలయ్య, ఏఓ నూర్జహాన్, సీనియర్ అసిస్టెంట్ మద్దమ్మ పాల్గొన్నారు.

నందికొట్కూరు: జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని మిడుతూరు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. మహాత్మాగాంధీ, బీఆర్ అంబేడ్కర్ చిత్ర పట్టాలకు ఎంపీడీఓ దశరధరామయ్య, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గ్రామస్తుల చొరవతోనే అభివృద్ధి

ఆత్మకూరు: గ్రామస్తుల చొరవతోనే గ్రామాభివృద్ధి సాధ్యమని సర్పంచ్ పిట్ల వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని సిద్దాపురం గ్రామంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ సమస్యలను చర్చించుకుని సత్వర పరిష్కారం కోసం సర్పంచ్ ఆధ్వర్యంలో కృషి చేస్తామని గ్రామపెద్దలు ఇస్తారయ్య, నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి సభ్యులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్ ప్రభుత్వ పథకాల గురించి సచివాలయ సిబ్బందికి శాఖ పరమైన నివేదికలను గ్రామ సభ ఎదుట వివరించారు.

మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థ అమలు


మాట్లాడుతున్న ఎంపీడీఓ సుమిత్రమ్మ

పగిడ్యాల: దేశంలో మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థ అమలులో ఉందని మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి సుమిత్రమ్మ అన్నారు. జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవంలో భాగంగా గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానిక పాలన వ్యవహారాలను సమర్థవంతంగా నిర్వహించడంలో పంచాయతీ రాజ్ సంస్థలు కీలకమన్నారు. పాలన సక్రమంగా జరిగినప్పుడే గ్రామీణాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నాగేంద్రయ్య, పీఆర్ ఏఈ జావేద్, పంచాయతీ కార్యదర్శి ఉపేంద్రారెడ్డి, గ్రామ సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలి


మాట్లాడుతున్న ఎంపీపీ తొగురు సరోజినీ వర్ధినియ

పాములపాడు: ప్రతి గ్రామంలో ప్రజలకు అవసరమైన సదుపాయాలతో అభివృద్ధి చెందాలని ఎంపీపీ తొగురు సరోజిని వర్ధినియ అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రతి గ్రామ పంచాయతీ సర్వతోముఖాభివృద్ధి సాధించాలని, అందుకు వార్డు సభ్యులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు అధికారులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, ఏఓ గాయత్రీ, ఎంపీటీసీ మద్దూరు బషీరాహ్మద్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.